నాకు నచ్చిన నా కథ

వాసిరెడ్డి సీతాదేవి

నాకు చిన్నతనం నుంచి సర్కస్ అన్నా, బాక్సింగ్ అన్నా, వెయిట్ లిఫ్టింగ్ అన్నా చూడానికి ఇష్టపడను. అలాంటివి చూడడంలో నాకు ఆనందం కలుగదు. ఏదో బాధ కలుగుతుంది.

చాలా సంవత్సరాలు హైదరాబాద్ ఎగ్జిబిషన్‌లో ఓ వ్యక్తి వంటిమీద కిరసనాయిల్ పోసుకుని, నిప్పు అంటించుకొని చాలా ఎత్తునుంచి కిందనున్న నీళ్లటాంకులోకి దూకేవాడు. అది చూడటానికి చాలామంది ఎనిమిది తర్వాత టికెట్ కొని అక్కడికి వెళ్ళేవాళ్లు, ఎవరు ఎన్నిసార్లు పిల్చినా నేను మాత్రం ఆ దృశ్యం చూడలేనని చెప్పేశాను. అలాంటివారిని ప్రభుత్వం ఎందుకు అనుమతిస్తుందని మథనపడేదాన్ని.

ఈ కథ ఆగస్టు 1968 లో జయశ్రీకి రాశాను. 1969 లో ఎగ్జిబిషన్‌లో కిరసనాయిల్ పోసుకుని నిప్పంటించుకునే వ్యక్తి రాలేదు. ఎక్కడో లేక ఇక్కడేనో ఇలాంటి ఫీట్ చేస్తూ చచ్చిపోయాడని- అది విని నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. ఈ కథ రాసిన ఆరునెలల తర్వాత ఈ విషయం తెలిసింది నాకు. చాలా చిత్రంగా ఉంది కదూ!

కొందరు నాస్తికులు ఆస్తికులు కావడం, ఆస్తికులు నాస్తికులు కావడం చూస్తుంటాము. విభిన్న విశ్వాసాలు ఉన్నవారిమీద ఒకే సంఘటన ప్రభావం

పడి. వారి విశ్వాసాలు సమూలంగా మారిపోవడం కూడా జరుగుతుంది.

ఈ కథ నాకు నచ్చిన నా కథలలో ఒకటి.

తమసోమా జ్యోతిర్గమయ

"ఏవరూ? గోపాలం! నువ్వటోయ్?"

గోపాలం కాళ్లకు సడన్ బ్రేక్ పడినట్లు ఆగిపోయాడు

ఎదురుగా సిద్ధాంతిగారు కన్పించారు. పచ్చగా, పొట్టిగా, లావుగా, గుండ్రంగా ఉన్న విగ్రహం ఒకదానిమీద ఒకటి మూడు సున్నాలు చుట్టి నట్టుంది. చొక్కా లేకుండా కప్పుకున్న నీలం శాలువాలోనుంచి బొజ్జ కన్పి స్తున్నది. మోకాళ్లవరకు ధోవతి. చేతులకు సింహతలాటాలు. లలాటం మీద కుంకుమబొట్టు.

"ఏమిటోయ్ అలా చూస్తావ్? నాన్నగారు కులాసాగా ఉన్నారా?"

"ఆరోగ్యం అంత బాగా లేదు."

"నీ చదువు పూర్తి అయిందా?"

"ఆఁ ఎం ఏ. పాసయాను. ఉద్యోగాన్వేషణలో ఉన్నాను. నాన్నగారికి ఇదో దిగులు."

"అన్నీ తెలిసిన మీ నాన్నగారు ఈ చిన్న విషయాలకు దిగులుపడడం ఏమిటి?"

"అన్నీ తెలిసినవారికి సమస్యలు ఉండవా?"

"ఉంటాయనుకో, దిగులుపడి చేసేది మాత్రం ఏముంది?" ప్రాప్త వ్యమర్థం లభ్యతే మనిష్యః! దేవో పిశం లంఘయితుంనీ శక్తిః." అన్నాడు సిద్ధాంతి అరమోగ్చు కన్నులతో కుడిచేతిని గాలిలోకి విసురుతూ.

"నాకు సంస్కృతం రాదు. అర్థం తెలవిస్తారా?" వళ్ళు మండిన గోపాలం అడిగాడు

"అంటే మానవుడు తను పొందవలసిన వస్తువును తప్పక పొందును. దానిని భగవంతుడు కూడా ఆపలేడు," సిద్ధాంతి గర్వం ఉట్టిపడే స్వరంతో అన్నాడు.

"అంటే మనకు ప్రాప్తం ఉంటే దానంతట అదే లభిస్తుందంటారు? భగవంతుడు కూడా అడ్డుకోలేడన్నమాటేగా?"

"అక్షరాలా అంతే!" బొడ్లోనుంచి ముక్కుపొడుం డబ్బా తీస్తూ అన్నాడు.

"అంటే భగవంతుడు కావాలనుకున్నా ఒక వ్యక్తిని బాగుచెయ్యనూ లేడు-పాడుచెయ్యనూ లేడు- అంతేగా!"

"అవునవును!" కొంచెం తడబడ్డాడు సిద్ధాంతి.

"అయితే మరి భగవంతుడు చెయ్యగలిగిం దేమిటో తెలవిస్తారా!"

సిద్ధాంతి పొడుంకాయ మూత తీశాడు. అరచేతిలో ఇంత పొడుం వేసుకుని ముక్కుదగ్గర పెట్టుకుని గట్టిగా పీల్చాడు.

"ఎక్కడిదాకా!" సంభాషణ మారుస్తూ గోపాలాన్ని అడిగాడు.

"అవాడినుంచి అనంతలోకి" అన్నాడు గోపాలం

సిద్ధాంతి ఫొల్లున నవ్వాడు. చేతిలో ఉన్న పొడుంకాయ మూత పెట్టి బొడ్లో దోపుకున్నాడు. అరచేతిని కాలువాకు తుడిచుకున్నాడు. మళ్ళీ అరచేతితో ముక్కు తుడుచుకున్నాడు

"తమరు ఎక్కడ్నుంచీ, ఎక్కడిదాకా!"

"కలెక్టరుగారింటినుంచి వస్తున్నానోయ్! నలుగురు ఆడపిల్లల తర్వాత ఓ వంశోద్ధారకుడు జన్మించాడు. ఆ కుర్రాడికి జాతకం రాసి వస్తున్నాను."

"బ్రహ్మాండంగా వుంది. అదృష్టజాతకుడు. ఎనభై ఏళ్ళు జీవిస్తాడు. మహారాజ వైభవం అనుభవిస్తాడనుకో!"

గోపాలం సిద్ధాంతి పక్కనే నడుస్తున్నాడు. అతనికి ఏనేమీ లేదు. ఏమీ తోచక, భవిష్యత్తు గురించిన ఆలోచననుంచి తప్పించుకోవడానికి పేవ్‌మెంటు మీద నడుస్తున్నాడు. అయినా అతన్ని ఆలోచనలు వదలడం లేదు. సిద్ధాంతి మంచి సమయానికి దొరికాడు అతన్ని ఒక పట్టాన వదిలిపెట్టాలని లేదు.

"ఒకవేళ మీ జాతకం "

"అఁ అఁ ఏంతమాట! నేను వ్రాసిన జాతకాన్నే సందేహిస్తున్నావా!"

"ఒకప్పుడు మీ నాన్నగారు మంచి స్థితిలో ఉన్నారు. మీరు నా జాతకం కూడా బ్రహ్మాండంగానే రాశారు."

సిద్ధాంతి నడక వేగం పెంచాడు. గోపాలం కూడా నడక వేగం పెంచాడు,

"మీ జాతకం ప్రకారం కలెక్టరుగారి అబ్బాయి ఎనభైఏళ్ల బ్రతికి తీరాలంటారు. అవునా!"

"అవును!"

"ఒకవేళ సంవత్సరం తిరక్కుండానే.... లేక "

"అలా రాసిరావడానికి వీలులేదు."

"అకాల మృత్యువని దేన్ని అంటారు?"

సిద్ధాంతి ఆ మాటలు వినిపించుకోనట్టు చకచక నడుస్తున్నాడు.

"ఆ కాలం వస్తే ఎన్ని ప్రయత్నాలు చేసినా మృత్యువునుండి తప్పించుకో లేమంటారు గదూ?"

"ఈ కుర్రకుంక ఇవ్వాళ నా వెంటపడ్డాదేం?" మనసులోనే అనుకున్నాడు సిద్ధాంతి.

"అవును నాయనా! నా కాలే మ్రియతే కశ్చిత్ ప్రాప్తకాలేన జీవతి." అన్నాడు పైకి.

"అంటే నాకు ఫలానా రోజు ఫలానా జబ్బుతో చావాలని రాసిపెట్టి వుంటే, చావు తప్పదంటారు, మన ప్రయత్నాలు వ్యర్థం అంటారు. అంతేనా!"

"అంతే నాయనా!"

"వెంకట్లక్ష్మిగారి అబ్బాయికి జబ్బుచేస్తే డాక్టర్ నాయర్ కాళ్ళమీద పడ్డారెందుకండీ నాన్నగారు బ్రతికించమని ఏడ్చారుగా?"

సిద్ధాంతి బోనులో పడిన ఎలుక చందమైంది.

"ఉద్యోగినం పురుష సింహముపైతి లక్ష్మీ. మన ప్రయత్నం మనం చెయ్యాలిగా?"

గోపాలం ఫక్కున నవ్వాడు.

సిద్ధాంతి వినిపించుకోనట్టే నడిచాడు.

"మీ సిద్ధాంతాలన్నీ పరస్పర విరుద్ధంగా ఉన్నాయి గురూగారూ!"

సిద్ధాంతి నడక వేగం పెంచాడు.

"ఆ మేకపిల్లను చూడండి."

గోపాలం అన్నది ఏమిటో అర్థంకాక సిద్ధాంతి నిలబడిపోయాడు.

"ఆ మేకపిల్లకు భగవంతుడు మరో ఆరునెలలకు చావు రాసిపెట్టాడే అనుకోండి. ఆ తర్వాతే అది చావదుగా?"

"చావదు."

"నేను దాన్ని కొని ఈ రోజే చంపితే?"

మీది రాతిగుండెంటు గదా.. అక్క ఈ కొబ్బరికాయలు మీ గుండె మీద పగలకొట్టుకుని త్వరగా తీసుకు రమ్మంది బావగారూ!!

సిద్ధాంతి గంభీరంగా నవ్వాడు. ఆ నవ్వు గోపాలాన్ని ఎంత అజ్ఞానంలో పడివున్నావు నాయనా!" అని జాలిపడినట్టుంది.

"దానికి ఈనాటితో ఋణం తీరితేనే నీకు అలాంటి బుద్ధి పుట్టిస్తాడు ఆ సర్వాంతర్యామి 'తాదృశీ జాయతే బుద్ధిః యాదృశీ భవితవ్యతాః' ఎలా రాసి పెట్టివుంటే అలాగే మనచేత మన బుద్ధి చేయిస్తుంది."

"అంటే బుద్ధి స్వతంత్రంగా పనిచేయదన్నమాట!"

"చెయ్యదు" నిశ్చితంగా అన్నాడు సిద్ధాంతి.

"అంటే మానవుడు చేసే పనులకు అతడు బాధ్యుడు కాదన్నమాటేగా? మరి ఇది పుణ్యం! ఇది పాపం! ఇది చెయ్యి! ఇది చెయ్యకు! అనే నీతిబోధలు ఎందుకు? మీ ధర్మశాస్త్రలు ఎందుకూ?"

సిద్ధాంతికి కోపం వచ్చింది. ముక్కుపొడుం గట్టిగా పీల్చి ఉక్కిరి బిక్కిరై పోయాడు.

"మానవుని బుద్ధి స్వతంత్రంగా పనిచెయ్యదు గదా? అది భగవంతుడి నిర్ణయానికి బద్ధమై ఉంటుంది అంటున్నారు"

"నేను అనడం ఏమిటి! శాస్త్రాలు ఘోషిస్తున్నాయి."

"అదేలెండి. మరైతే భగవంతుడు అందరి చేతా మంచిపనులే చేయించ వచ్చుగా ?"

సిద్ధాంతి సమాధానం ఇవ్వలేదు

"ఇవాళ తమరి దగ్గర చాలా ముఖ్యమైన విషయం తెలుసుకున్నాను."

"ఏమిటో అది ?" నొక్కుతూ అన్నాడు సిద్ధాంతి.

"పాపం చేసిన వ్యక్తి బాధపడనక్కర్లేదు."

సిద్ధాంతి రక్కున నిల్చున్నాడు.

"రామ ! రామ ! నేను అలా అన్నానా ?"

"ఇంతకు ముందే కదండీ అన్నారు ?"

"ఏమని ?"

"బుద్ధి స్వతంత్రమైంది కాదనీ, ఏది చేయించినా ఆ లీలామయుడేననీ..."

"మీలాంటి నాస్తికులకు సమాధానం ఇవ్వలేను నేను మా గురువు చెప్పింది నమ్మాను. మరొకరికి చెబుతున్నాను."

అంతలో రోడ్డుపక్కగా శవం ఎదురైంది శవవాహకులు వేగంగా నడుస్తున్నారు.

సిద్ధాంతి పేవ్‌మెంటు మీద ఓరగా నిల్చొని కళ్ళు మూసుకున్నాడు.

"భగవాన్ ! ఈ మృతుని ఆత్మకు శాంతి కలుగునట్లు చెయ్." అని ప్రార్థించాడు.

గోపాలం సిద్ధాంతి ముఖంలోకి చూస్తూ నిల్చున్నాడు.

సిద్ధాంతి కళ్ళు తెరిచాడు.

"ఇవ్వాళ ముక్కోటి ఏకాదశి, ఎంత పుణ్యంచేసుకుంటే ఇవ్వాళ చావు లభిస్తుంది ?" తన్మయత్వంతో అన్నాడు సిద్ధాంతి.

"అదేమిటి గురువుగారూ ! ఆ చావు మీకే లభించినట్టు ఆనందపడి పోతున్నారు ?" అన్నాడు గోపాలం.

సిద్ధాంతి తృప్తిపడ్డాడు. గోపాలం కేసి చురచుర చూశాడు.

"అయితే గురువుగారూ ? ఈ రోజు చనిపోయినవాళ్లు తిన్నగా వైకుంఠానికే వెళ్తారటగా ?" అన్నాడు గోపాలం.

సిద్ధాంతి కోపం ఎగిరిపోయింది.

"అవునయ్యా గోపాలం. ఇవ్వాల్టి రోజు వైకుంఠం ద్వారాలన్నీ బార్లాతెరిచి

ఉంటాయి. తిన్నగా ఆ శేషతల్పశాయి పాదపద్మాల దగ్గరికే వెళ్ళి వాలిపో వచ్చును." ఆనందపారవశ్యంతో అన్నాడు.

"అయితే స్వామీ ఆత్మ అనేది ఒకటి ఉన్నదంటారా ?"

"అయ్యో ! ఎంతమాట ? ఈ శరీరం అశాశ్వతం. ఆత్మ శాశ్వతమైనది. ఆత్మకు చావులేదు. ఆత్మ అమరం. ఈ శరీరం కేవలం మనం ధరించిన చొక్కా లాంటిది. అది మాసిపోతే తీసేస్తాం. అలాగే ఆత్మకూడా శిథిలమైన శరీరాన్ని విసర్జిస్తుంది"

"ఒకోసారి పసిశరీరాల్నీ, మంచి వయసులో ఉన్న శరీరాల్ని కూడా ఆత్మ వదిలేస్తుదేం ?"

"అదంతా పూర్వజన్మ సుకృత విశేషం నాయనా! ఈ భూమిమీద ఎంత కాలం ఋణం ఉంటే అంతే కాలం అనుభవించి పోతారు."

"కొందరు నిర్జీవంగానే పుడ్తారు."

"అవన్నీ చాలా పెద్ద విషయాలు. నీకు అర్థం కావు."

"అందుకేగా స్వామీ తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నాను." వ్యంగ్యంగా అన్నాడు గోపాలం.

సిద్ధాంతి ముఖం ఎర్రగా అయింది.

"కోపం వచ్చిందాండి ?"

"కోపం ఎందుకూ ?" కోపంగా అన్నాడు సిద్ధాంతి.

"ఒక్క సందేహం ?"

సిద్ధాంతి పలకలేదు. ఉలకలేదు. గోపాలం వదలలేదు.

"ఆత్మ అంటే ఏమిటి? దానిని ఈ శరీరం తాలూకు ఆ ధివ్యాధులూ ఈతిబాధలూ బాధిస్తాయా"

"శరీరం, ఇంద్రియాలూ, మనసు, బుద్ధి వీటికి అతీతమైనదీ సత్-చిత్-ఆనంద్-స్వరూపమైనదీ మరొకటి ఉన్నది. అదే ఆత్మ. ఆత్మ నిత్య నిర్మలమైంది, సర్వ స్వతంత్రమైంది ఆత్మ స్వయం ఆనంద స్వరూపం. దానికి బాధ లేమిటి? ఆత్మ ఆ పరమాత్మ అంశమే! దానికి శరీరం తాలూకు ఎలాంటి కల్మషం అంటదు."

"కొంచెం ఆగండి స్వామీ! మీలోనూ నాలోనూ ఉన్న ఆత్మ ఒకటేనా?"

"అవురాలా ! నీలోనూ, నాలోనూ, సమస్త జీవరాసుల్లోనూ ఉండే ఆత్మ ఒక్కటే. అంతా ఆ పరమాత్మ అంశం. యోగమాయ చేత కప్పబడ్డ ఆత్మ తన అసలు స్వరూపాన్ని విస్మరించి ఈ భౌతికసుఖాల కోసం ప్రాకులాడుతుంది."

అంటూ గోపాలం ముఖంలోకి ఇప్పుడైనా అర్థం అయిందా?" అన్నట్లు చూశాడు సిద్ధాంతి.

గోపాలం అదోలా నవ్వాడు.

"ఒకవైపు ఆత్మ ఆనందస్వరూపం, స్వయం స్వతంత్రమైంది అంటున్నారు. దానికి శరీరం తాలూకు ఈతిబాధలు అంటవంటున్నారు. మరోవైపు యోగమాయలకు వశం అవుతుందంటున్నారు. సాక్షాత్తూ పరమాత్మ అంశమైన ఆత్మను యోగమాయ కప్పివేయడం ఏమిటి? ఇంతకుముందు శవం ఎదురైనప్పుడు మృతుని ఆత్మకు శాంతి కలుగుగాక అని భగవంతుని ప్రార్థించారు. సత్- చిత్- ఆనంద స్వరూపం అయిన ఆత్మకు అశాంతి ఎలా కలుగుతుంది? శాంతి కలగాలని మళ్లీ ప్రార్థించడం ఏమిటి? పైగా చావు బ్రతుకులనేవి భౌతిక కాయానికి సంబంధించినది కదా? మరి " ఆగి సిద్ధాంతి ముఖంలోకి చూశాడు గోపాలం.

సిద్ధాంతి ముఖంలో చిరాకు కన్పించింది. గోపాలానికి అతనిమీద జాలి వేసింది.

"ఒకసారి నాన్నగారిని చూడటానికి రండి." అన్నాడు గోపాలం మాట మారుస్తూ

సిద్ధాంతి ముఖం విప్పారింది.

"అలాగేనోయ్! ఇప్పుడు ఎక్కడికెళ్తున్నావ్?"

"నాకే తెలియదు" అన్నాడు గోపాలం.

"అయితే నాతో రా!" అన్నాడు సిద్ధాంతి.

"ఎక్కడికి?"

"ఇవ్వాళ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో పదహారు సంవత్సరాల బాలుడు ఒంటి మీద పెట్రోలు పోసుకొని నిప్పంటించుకొని, మూడు వందల గజాల పైనుంచి కిందనున్న బావిలోకి దూకుతాడట. చూద్దాం! పద!"

గోపాలం ఆశ్చర్యంగా సిద్ధాంతి ముఖంలోకి చూశాడు. "మీకు ఇలాంటి కోరికలు కూడా ఉన్నయ్యా?"

"ఏదో సరదా!" గొల్లున నవ్వాడు సిద్ధాంతి.

"అవును! ఇతరులను అపాయంలో చూడటం చాలామందికి సర్దాగానే ఉంటుంది." గోపాలం తనకు తనే అనుకున్నట్టు చిన్నగా గొణిగాడు.

సిద్ధాంతి అర్థంకానట్టు చూశాడు.

"బాక్సింగ్, రెజిలింగ్, సర్కస్ పీట్స్, పులుల మధ్య కూర్చుని వాటిని రెచ్చగొట్టడం, మొదలైన దృశ్యాలను చూడటానికి జనం ఎందుకు సర్దాపడుతుంటారు?" -

"ఎందుకేమిటి? అదో వింత! ఇందులో ఇతరులు అపాయంలో ఉంటే సంతోషించే ప్రశ్న ఎక్కడుంది?"

"ఎవరైనా పిల్లితో, కుక్కతో ఆడతారంటే వెళ్తారా? పది గజాల ఎత్తు నుంచి ఎవడో దూకుతున్నాడంటే మీరు వెళ్తారా?"

"అందులో విశేషం ఏముంది?"

"అందులో అపాయం ఏముంది అనండి."

సిద్ధాంతి ఆలోచనలో పడ్డాడు.

"ఒకరకంగా ఇలాంటివి చూసి ఆనందించడంలో క్రూరత్వం ఉంది. మనిషి జంతువులనుంచి వచ్చాడనే దానికి ఇది నిదర్శనం. మానవుడిలోని ప్రాథమిక అంటే పాశవిక ప్రవృత్తులకు సంతృప్తి కావాలి."

"అబ్బబ్బ! ఇక నీ ఉపన్యాసం మానెయ్! ఇంతకీ నువ్వు ఎగ్జిబిషన్ గ్రౌండ్సుకు వస్తావా రావా?"

"వస్తాను పదండి."

ఇద్దరూ ఎగ్జిబిషన్ గ్రౌండ్సుకు వచ్చేసరికి బాగా చీకటిపడింది. ఎగ్జిబిషన్ ఆవరణలో దీపాలు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. జనం వస్తున్నారు. ఆడవాళ్ళు, పిల్లలూ మరీ ఎక్కువగా వుండడం గోపాలానికి మరీ ఆశ్చర్యాన్ని కలిగించింది.

"ఇలాంటి వాటికి పిల్లల్ని తీసుకురావడం ఎందుకు?" అనుకున్నాడు గోపాలం,

టికెట్టు కొనుక్కొని బావి దగ్గరకు వెళ్ళారు. అప్పటికే జనం చుట్టూ కూర్చుని ఉన్నారు. ఇప్పటినుంచే జనంలో కూర్చోవడం గోపాలానికి వచ్చ లేదు. అసలు గోపాలానికి ఆ వింత చూడాలని లేదు. ఆ కుర్రవాడిని చూడాలని ఉన్నది సిద్ధాంతి కళ్ళు ఎవరికోసమో వెతుకుతున్నట్లు అన్పించింది గోపాలానికి. ఇద్దరూ ముందుకు నడిచారు! ఒకచోట ఒక కుర్రవాడు ఖాకీ దుస్తుల్లో కన్పించాడు. అతని చుట్టూ ఓ పది పదిహేనుమంది యువకులు ఉన్నారు. ఇద్దరూ ఆ గుంపు దగ్గరకు వెళ్ళారు.

అంతలో ఓ గుబురుమీసాల వ్యక్తి అక్కడ చేరిన జనాన్ని మందలించి

దూరంగా పంపిచాడు. సిద్ధాంతిని చూడగానే అతని ముఖం విప్పారింది. చేతులు జోడించి నమస్కారించాడు,

"అయ్యవార్లూ రండి! రండి! పొద్దుట తమకోసం కబురు పంపించాను." అన్నాడు ఆ వ్యక్తి ఉత్సాహంగా.

"కబురు అందింది యాదగిరీ! ఉదయం రావడానికి తీరిక చిక్కలేదు. అందుకే ఇటొచ్చాను. నీ కొడుకు జాతకం రేపొచ్చి చూస్తాలే!"

"తమరు టికెట్ కొనడం ఏమిటి? నాకు కబురుచేస్తే"

"పర్వాలేదులే. ఈ కుర్రవాడు కొన్నాడు." అంటూ గోపాలాన్ని చూపించాడు

యాదగిరి వాళ్ళిద్దర్నీ బావికి పదడుగుల దూరంలో చుట్టూ మూయగట్టిన డేరాలోకి తీసుకువెళ్ళాడు. ఖాకీ దుస్తుల్లో ఇంతకుముందు కన్పించిన కుర్రవాడు అక్కడే ఉన్నాడు.

యాదగిరి గత పాతికేళ్ళుగా తిరునాళ్ళలోనూ, ఎగ్జిబిషన్స్‌లోనూ, మెర్రీగో రౌండ్స్, లక్కీ డిప్పులూ, చటాకీయా-చిటాకీలూ కలిపి అనేక తమాషాలు చేయించి, జనానికి వినోదాన్ని అందించి బాగా డబ్బుసంపాయించాడు.

యాదగిరి కుర్రవాణ్ణి సిద్ధాంతికి పరిచయంచేశాడు.

ఆ కుర్రవాడు పచ్చగా ఉన్నాడు. బొద్దుగా ఉన్నాడు. ఆకర్షణీయంగా ఉన్నాడు. కళ్ళలో మెరుపు ఉంది. ముఖంలో పసితనం ఉంది. పసితనాన్ని పార దోలి యవ్వనం ఆ ముఖాన్ని ఆక్రమించే ప్రయత్నంలో ఉన్నట్టు నూనూగు మీసాలు చెబుతున్నాయి.

యాదగిరీ, సిద్ధాంతి "ఇప్పుడే వస్తాం" అంటూ బయటికి వెళ్ళారు.

గోపాలం కళ్ళు ఆ కుర్రవాడి ముఖంమీదనే ఉన్నాయ్. ఈ కుర్రవాడు చచ్చిపోతే! గోపాలం వెన్నెముకలోకి చలి కుదుపు వచ్చింది.

"నీ పేరేమిటి బాబూ!" అన్నాడు.

"నాగేష్" అన్నాడు. గొంతు చాలా బొంగురుగా ఉంది ఆ వయసుకు మగపిల్లల గొంతు అలాగే ఉంటుంది అనుకున్నాడు గోపాలం.

"ఎంత కాలంగా చేస్తున్నావ్?"

"ఇదే మొదటిసారండి!" ఉత్సాహంగా అన్నాడు.

తుళ్ళిపడ్డాడు గోపాలం.

"మొదటిసారా! భయం వెయ్యడంలేదూ?"

నాగేశ్ నవ్వాడు. ఆ నవ్వుతో అతని ముఖంలోకి కొత్త వెలుగు వచ్చింది. ఆ నవ్వులో ఆత్మవిశ్వాసం ఉన్నది.

"భయమా? ఎందుకూ?" విశ్వాన్ని జయించడానికి బయలుదేరిన సికిందర్ ఎవరైనా పై ప్రశ్న వేస్తే యిలాగే ఎదురుప్రశ్న వేసివుండేవాడేమో!

"ఈ విద్య నువ్వు ఎవరిదగ్గర నేర్చుకున్నావ్?"

"ఎవరి దగ్గరా నేర్చుకోలేదు మా కుటుంబవృత్తే ఇది." అన్నాడు నాగేశ్ నిర్లక్ష్యంగా.

"మీ నాన్నకూడా ఇదే పని చేశాడా?"

"అవును మా నాన్నే కాదు. మా నాన్న నాన్న, వాళ్ళ నాన్నకూడా ఇదే పనిచేశారు." ఉత్సాహంగా అన్నాడు

"మీ నాన్న ఉన్నాడా?"

"లేదండీ! చనిపోయాడు. పూనాలో ఈ ప్రదర్శన యిస్తూ చనిపోయాడు."

గోపాలం ఉలిక్కిపడ్డాడు! నాగేశ్ కళ్ళలోకి లోతుగా చూశాడు, ఆ కళ్ళలో కాంతిరేఖలు కదులుతూ కన్పించాయి.

"మీ తాత ఎలా చచ్చిపోయాడు?"

"మా తాత చాలాకాలం ఈ ఫీట్సు చేశాడు. చివరకు ఇది చేస్తూనే చచ్చిపోయాడు."

"మరి వాళ్ళ నాన్న?"

"మామూలు జబ్బుతోనే చచ్చిపోయాడట."

"ఇదంతా తెలిసే నువ్వీ సాహసం చేస్తున్నావా?"

నాగేశ్ నవ్వాడు. గలగల నవ్వాడు. పసిపాప నవ్వినట్టు నవ్వాడు. ఎవరో చక్కిలిగింతలు పెడ్తుంటే నవ్వినట్టు ఆగి ఆగి నవ్వాడు.

"బాబుగారూ! ఒకవేళ మీ తాతగారూ, వారి నాన్నగారూ ఆఫీసులో పని చేస్తూ చచ్చిపోయారనుకోండి. అందుకు మీ నాన్నగారు ఆఫీసులో పనిచెయ్యడానికి భయపడ్తారా? మీరు భయపడ్తారా? మీ నాన్న ఆఫీసులో చనిపోతే ఆఫీసులో పనిచెయ్యడానికి?"

గోపాలం ఆశ్చర్యంగా ఆ కుర్రవాడి మొఖంలోకి చూశాడు. అప్పుడే లోపలకు ప్రవేశించిన సిద్ధాంతి కుర్రవాడి చివరి మాటలు విన్నాడు.

"శబాష్ కుర్రాడా!" అన్నాడు వీపు తడుతూ.

గోపాలానికి సిద్ధాంతిమీద కోపం వచ్చింది.

"అదీ ఇదీ ఒకటి ఎలా అవుతుంది!" గోపాలం అన్నాడు.

"మీ నాన్న దగ్గర ఈ విద్యను ఎందుకు నేర్చుకోలేదు. నేర్చుకోకుండా పేట్సు ఎలా చేస్తావ్?" మళ్ళీ గోపాలమే ప్రశ్నించాడు.

"మా నాన్నకు నేను ఈ వృత్తి చెయ్యడం ఇష్టంలేదు. నన్ను చూడనిచ్చే వాడు కూడా కాదు. రెండు మూడుసార్లు నేనే ఆయన చూడకుండా జవంలో కూర్చుని చూశాను."

"మీ నాన్నకు నువ్వు ఏంచెయ్యాలని ఉండేది."

"బాగా చదువుకొని పెద్ద ఉద్యోగం చెయ్యాలని మా నాన్న కోరిక."

"ఎంతవరకు చదువుకున్నావురా కుర్రాడా!" సిద్ధాంతి అడిగాడు.

మొన్ననే స్కూల్ ఫైనల్ పరీక్ష రాశాను."

నాగేశ్ జవాబుకు ఇద్దరూ విస్తుపోయారు

"ఇంత చదువుకొని ఇదేం పని? ఏదైనా ఉద్యోగంచూసుకోక!" గోపాలం అన్నాడు.

నాగేశ్ ఎంతో అనుభవజ్ఞుడిలా నవ్వాడు. ఆ నవ్వుల్లో పసివాడి అమాయకత్వం లేదు. చేదు అనుభవాలు మనుషుల వయసును పెంచుతాయి కాబోలు!

"బాబుగారూ ఇంకా మీకు పరిస్థితులు తెలిసినట్టులేదు. ఈ రోజుల్లో ఎంఏలూ బియ్యేలూ ఉద్యోగాలు దొరకక తిరుగుతున్నారు."

"అందుకని ఎప్పటికీ ఇదే వృత్తి చేస్తావా!"

"లేదు. నేను ఇంకా చదువుతాను. ఐఏయస్ పాసవుతాను. కలెక్టర్ను అవుతాను." తనకు తనే చెప్పుకుంటున్నట్టు అంతర్ముఖుడై అన్నాడు. అలా అంటున్నప్పుడు ఆ కళ్ళు తళతళ్ళాడుతున్నాయి. ఆ వెలుగులో అతను తన భవిష్యత్తును స్పష్టంగా చూస్తున్నట్టు ముఖంలో ఆనందం వెల్లివిరిసింది.

గోపాలం కళ్ళలో నీరు తిరిగింది. నోట మాటరానివాడిలా ఆ పసిముఖం లోకి చూస్తున్నాడు.

"నువ్వు తప్పక గొప్పవాడివి అవుతావురా కుర్రోడా!" సిద్ధాంతి అన్నాడు.

"సిద్ధాంతిగారూ నాగేశ్ చెయ్యిచూడండి." అన్నాడు గోపాలం.

సిద్ధాంతి గోపాలం ముఖంలోకి ఆశ్చర్యంగా చూశాడు.

"ఇవన్నీ నేను నమ్మను. కాని ఎందుకో ఇప్పుడు నమ్మాలనిపిస్తుంది. చూడండి," అన్నాడు గోపాలం

నాగేశ్ కుతూహలంగా కుడిచెయ్యి ముందుకు చాపాడు.

సిద్ధాంతి చెయ్యి అందుకుని పరీక్షగా చూశాడు. అరచెయ్యి నొక్కి చూశాడు. వేళ్ళు చూశాడు. రెండో చెయ్యి చూశాడు. మళ్ళీ కుడిచేతిని పరీక్షగా చూశాడు.

"ఆహా! అదృష్ట జాతకుడివిరా! నువ్వు నక్క తోకతొక్కేవు అనుకోవు. అప్పుడు నాకు పంచెలచాపు పెట్టాలి సుమా!" నాగేశ్ ముఖంలో సిగ్గూ, ఆనందం, ఉత్సాహం ముప్పిరిగొన్నాయి.

"సిద్ధాంతిగారూ! నాగేశ్ ఎంతకాలం బ్రతుకుతాడో చెప్పండి" నాగేశ్ వినకుండా సిద్ధాంతి చెవులో నోరుపెట్టి ఆత్రంగా అడిగాడు గోపాలం.

"ఎనభై సంవత్సరాలకు డోకాలేదు" అన్నాడు పెద్దగానే సిద్ధాంతి.

"సరిగ్గా చూడండి."

"ఈ రేఖ చూడు కోడేరువేసినట్టు ఎంత పొడవుగా వుందో? ఎక్కడా కట్ కాలేదు. అడ్డుగీత లేదు."

గోపాలం మనసులో ఏదో పీడిస్తున్నది. దానినుంచి విముక్తి పొందడానికి తన మనసునే మభ్యపెట్టుకుంటున్నాడు.

"ఇంకా చదువుతానన్నావు ఎలా చదువుతావు?" గోపాలం అడిగాడు.

"ఈ ప్రదర్శనలు ఇస్తాను. కాలేజీలు తెరిచేటప్పటికి బోలెడంత సంపాదిస్తాను. ఇప్పటికిప్పుడే ఐదు వందలు కలెక్షన్. నా వాటా వంద."

"మిగతాది?"

"సగం యాదగిరికి, కొంత ఖర్చులకు పోతుంది. ఈ సెలవల్లో సంపాదనతో మా అక్కకు పెళ్ళిచేస్తాను. నా చదువుకు ఎప్పుడెప్పుడు సెలవలు వచ్చిన ప్పుడల్లా ప్రదర్శనలు ఇస్తాను."

"ఈ విద్య నీకు ఎవరూ నేర్పలేదు. దీని మెళకువలు నీకు తెలియవు. వద్దు ఇలాంటి పని చెయ్యకు." గోపాలం బాధపడ్డాడు.

"భయపడకండి బాబుగారూ! ఇదిగో చూడండి. ఈ ఆంజనేయస్వామి వారి బిళ్ళ. దీన్ని మా పూర్వుల దగ్గర్నుంచి ప్రదర్శనలు ఇచ్చేటప్పుడు వేసుకున్నారు." అంటూ గుండీలు తొలగించి షర్టు లోపలి ఉన్న ఆంజనేయస్వామి బిళ్ళ నల్లదారంలో గుచ్చి కట్టి తళతళ మెరుస్తున్న బిళ్లను చూపించాడు. అరచేతి వెడల్పున ఉన్న ఆ రాగిబిళ్ల మీద సంజీవి పర్వతాన్ని అరచేతిలో ఎత్తుకొని ఎగురుతున్న ఆంజనేయస్వామి బొమ్మ స్పష్టంగా కన్పించింది. ఆ బిళ్లను కళ్లకద్దుకుని షర్టులోపలకు వేసుకొని గుండీలు పెట్టుకున్నాడు నాగేశ్. చాలా

ఉత్సాహంగా ఉన్నాడు. ఎన్ని నయాగరా జలపాతాలైతే అతని ఉత్సాహంతో సమానం అవుతాయి ?

"మీ నాన్న చచ్చిపోయిన రోజు ఇది వేసుకోలేదా ?"

"చచ్చిపోయాడు. ఆ రోజు ఉదయమే మా అమ్మ ఈ బిళ్లను చింత పండులో రుద్ది, కడిగి, తుడిచి, గూట్లో పెట్టి పూజచేసింది. మీ నాన్న చచ్చి పోయి వెళ్ళిపోయాడు."

"అదీ అట్లా చెప్పు !" అన్నాడు సిద్ధాంతి.

"మీ నాన్న మామూలు బట్టలు వేసుకొని ఉండడు. మీ అమ్మగారిని అడిగి రావాలి పోయావా ?"

"బాబోయ్! మా అమ్మకు తెలిస్తే ఇంకేమైనా ఉందా ? బావిలోకి దూకి చచ్చిపోతానంటుంది." అన్నాడు నాగేశ్ తేలిగ్గా నవ్వేస్తూ.

గోపాలంకి ఆ కుర్రవాడి రెక్కపట్టుకొని ఈడ్చుకొని వెళ్ళిపోవాలని ఉంది.

"చూడు నాగేశ్ ! ఇవ్వాల్టి కిది మానెయ్ !" గోపాలం అన్నాడు-రేపు మీ అమ్మతో మాట్లాడదాం.

"అదెలా బాబూగారూ డబ్బు కలెక్షన్ అయిపోయిందిగా ?"

"దానికేముంది? ఎవరి డబ్బు వాళ్లకిచ్చేస్తే సరి !"

"అలా చేస్తే జనం యాదగిరిని ప్రాణాలతో వదుల్తారా ? అది వాళ్ల వంశంలో ఆనవాయితీగా వస్తున్న విద్య. పైగా ఆంజనేయస్వామి వాడి గుండెమీద దేదీప్యమానంగా వెలిగిపోతున్నాడు. చేతిలో జర్రిపోతులా జీవిత రేఖ ! భయమెందుకయ్యా !" అన్నాడు సిద్ధాంతి.

గోపాలంకి సిద్ధాంతిని వంగతీసి బాదాలనిపించింది.

నాగేశ్ కళ్ళలో కాంతిరేఖలు కనిపిపోతున్నాయ్

శరీరంలోని ప్రతి అణువులో జీవితం నిండుగా ప్రవహిస్తుంది గోపాలం ఆ కుర్రవాణ్ణి రెప్పవాల్చకుండా చూస్తున్నాడు.

దూరంగా జనంలో అల్లరి. ఈలలు. నాగేశ్ టెంటులో నుంచి తొంగి చూశాడు.

మైక్‌లోనుంచి కంట్రాక్టరు యాదగిరి కంఠం బిగ్గరగా వినిపిస్తోంది.

"త్వరపడండి."

"సమయం మించిపోకుండా త్వరపడండి."

"ఐదు నిముషాలలో అతిలోక భయంకర ఫీట్ జరుగబోతున్నది.

ప్రవేశం ఒక్క పావలా మాత్రమే!

ఇరవై అయిదు నయాపైసలు!

త్వరపడండి.

నాగేశ్ లవి విజృంభిస్తున్నాడు.

సిద్ధాంతి వళ్లు పులకించింది.

గోపాలం వళ్లు జలదరించింది.

మళ్లీ మైక్‌లో స్వరం-

"ప్రపంచంలో కనీ వినీ ఎరుగని వింత!

ముక్కుపచ్చలారని పదహారు ఏళ్ల బాలుడు! సాక్షాత్తు అభిమన్యుడు!

ఐదు వందల గజాల ఎత్తునుంచి అగ్నిగోళంగా మారి, సరాసరి మృత్యు గహ్వరంలోకి ఎలా దూకుతాడో కనులారా చూడండి.

ఒక్క పావలా మాత్రమే!

వెల్ ఆఫ్ డెత్!

ఒక కప్పు టీ ధరకు

వెల్ ఆఫ్ డెత్!

రెండు రబ్బరు బెలూన్ల వెల?

ఇరవైదు నయాపైసలు మాత్రమే!

త్వరపడండి!

షో బిగిన్ కాబోతోంది!

వెల్ ఆఫ్ డెత్!

పదహారేళ్ల అభిమన్యుడు."

యాదగిరి కంఠం కంచుగంటలా మ్రోగుతుంది.

"వెల్ ఆఫ్ డెత్! అభిమన్యుడు వ్యూహం పద్మ వ్యూహం గోపాలం చెవుల్లో గింగురుమంటున్నది యాదగిరి కంఠం.

మెదడులో ఏదో కదిలినట్లు అయింది.

గుండెల్లో తుమ్మముల్లు కసుక్కున దిగినట్టు అయింది.

గోపాలం బయటికి వెళ్తానే నాగేశ్ చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు.

"బాబుగారూ! భయపడకండి. టైం అయిపోయింది." నాగేశ్ గోపాలం ముఖంలోకి చూస్తూ అంటున్నాడు.

"పోనీయవయ్యా! అంతా అంజనేయస్వామే చూసుకుంటాడు" సిద్ధాంతి.
"మళ్ళీ అర్ధగంటలో వచ్చి మీకు కన్పిస్తాను. నమస్కారం బాబూగారూ! అంటూ గోపాలం చెయ్యినుంచి తన చేతిని విడిపించుకొని చరచర బయటికి వెళ్ళిపోయాడు.
దూరంగా బావిదగ్గర నిచ్చెన ముందు నిలబడ్డ నాగేశ్‌ను తదేక దృష్టితో చూస్తున్న గోపాలాన్ని భుజం తట్టి "రావోయ్ గోపాలం" అన్నాడు సిద్ధాంతి.
"నేను రాను. మీరు వెళ్ళండి."
సిద్ధాంతి గోపాలం ముఖంలో వెర్రివాణ్ణి చూసినట్టు చూసి ముందుకు కదిలాడు."

మరో రెండు నిముషాలకు నిచ్చెన మెట్లలా కట్టిఉన్న ఇనపమెట్లను గబగబా ఎక్కిపోతున్నాడు నాగేశ్. వేలకొద్దీ కళ్ళు ఆ కుర్రవాడితోపాటు పైకి ఒక్కొక్క మెట్టే ఎక్కుతున్నాయి. అందరూ గాలి పీల్చుకోవడంకూడా మర్చిపోయినట్టు చూస్తున్నారు.
గోపాలం మెడ విరుచుకుని పైకి చూసాడు.
చుక్కల్లో చందమామలా నాగేశ్— విశాలమైన ఆకాశంలో తెల్లని నల్లని మబ్బులు కింద ఇనపచట్రంలో నిలబడి ఉన్నాడు.
పదహారేళ్ళ నాగేశ్ ఐదేళ్ళ పిల్లవాడికంటే చిన్నగా కన్పిస్తున్నాడు.
బావిచుట్టూ జనం ఇసుకవేస్తే రాలకుండా ఉన్నారు. మోరలు పైకెత్తి కన్నార్పకుండా చూస్తున్నారు. ఆరునెలల గర్భిణీస్త్రీ ఏణ్ణర్ధం పిల్లాడ్ని చంక నేసుకోని గుండెలు చిక్కబట్టుకొని పైకి చూస్తోంది. నాగేశ్ జేబులో నుంచి సీసా తీశాడు.
"పెట్రోల్! పెట్రోల్!" జనంలోనుంచి కేకలు.
సీసా బిరడాతీసి వంటిమీద వలకబోసుకున్నాడు.
సీసాను కింద బావిలోకి విసిరాడు.
రెండో జేబులోనుంచి అగ్గిపెట్టె తీసి అందరికీ చూపిస్తున్నాడు. అగ్గిపెట్టె కన్పించకపోయినా అతను చూపిస్తున్న దేమిటో జనానికి అర్థం అయింది.
సిద్ధాంతికి చిరుచెమటలు పట్టి చంకలోని పంచాగం, రొంటినున్న ఐదు రూపాయలనోటూ చెమ్మగిల్లాయి. ఆ సమయంలో ఓ చిటికెడు ముక్కు పొడుం పట్టిస్తే బాగుండు ననిపించింది కాని ఆ లోపల ఆ దృశ్యం కాస్తా జరిగిపోతే?

"చూడండి జనులారా. మృత్యువుతో పోరాటం. వెల్ ఆఫ్ డెత్" శార స్థాయిలో ఉన్న యాదగిరి కంఠం అకస్మాత్తుగా ఆగిపోయింది.

వెంటనే పెద్దగా గంట మోగింది.

ఒకటి . రెండు మూ :

పేదవాడి ఆకలిలా అగ్నిదేవుడు భగ్గుమన్నాడు.

నాలుకలు చాచిన అగ్నిజ్వాలతో పాటు ఓ ఆర్తనాదం విన్పించింది.

ఆ మండుతున్న ఆకారం క్షణాలలో గిర్రున తిరుగుతూ వచ్చిపడింది. వెల్- ఆఫ్- డెత్ అదే బావిలో పడలేదు. బావి దగ్గర్లో నిల్చుని పైకి చూస్తున్న వాళ్లమీదనే పడింది.

జనం కకావికలై పరుగెత్తసాగారు.

కొందరికి బట్టలు అంటుకున్నాయి.

పిల్లా- జల్లా, ఆడా- మగా, విచక్షణ లేకుండా విరగదొక్కుకుంటు న్నారు.

క్రిందపడ్డవాళ్ళ మీదగా నడిచి ప్రాణాలు రక్షించుకోవడమే ఆ భీభ త్సంలో పరమధర్మంగా పాటించబడింది.

గోపాలం గుండె బద్దలైంది.

మస్తిష్కంలో అగ్నిగోళాలు లేచాయి.

కళ్లలో అంధకారం సుళ్ళు తిరగసాగింది. ఏవేవో రూపాలు అల్లిబిల్లి తిరిగాయి.

సిద్ధాంతి వచ్చి రెక్కపట్టుకొని లేపేంతవరకూ గోపాలం ఈ లోకంలో లేడు, స్పృహవచ్చిన గోపాలం లేచి మట్టి దులుపుకొని సిద్ధాంతి భుజం ఆసరాగా బయటకు నడిచాడు.

కొద్దినిముషాల క్రితం- ఆనందంతో, ఉద్రేకంలో పరవళ్ళు తొక్కుతూ కేరింతలు కొడ్తోన్న ప్రదర్శనలో వాతావరణం భీభత్సంగా మారింది. ఆర్త నాదాలతో మారుమోగింది.

సిమెంటు రోడ్డుమీద నడుస్తోన్న గోపాలం, ఇసకలో కూరుకుపోతు న్నట్టు అడుగులో అడుగు వేస్తున్నాడు. పక్కనే సిద్ధాంతి పాదాలు భూమిని ఛాటిగా తాకుతున్నాయి. ఇద్దరి మధ్య మౌనం హిమాలయ పర్వతంలా నిల్చింది. గోపాలం మనసు వేడిగా- ఉదకం ఘనీభవించే స్థితిలో ఉన్నది. సిద్ధాంతి మనసు

వేడిగా- మంచుకరిగే స్థితిలో ఉన్నది. నడుస్తూ నడుస్తూ గోపాలం అకస్మాత్తుగా ఆగిపోయాడు.

దేవాలయంలో నుంచి గంటలు వినిపిస్తున్నాయి। అది ఆంజనేయస్వామి వారి గుడి. శనివారం కావడం వల్ల గుళ్లో హడావిడిగా ఉంది. గర్భగుడిలోంచి ఆంజనేయస్వామివారి దండకం స్పష్టంగా వినిపిస్తోంది. గోపాలానికి ఏమీ కన్పించడం లేదు. అంతా చీకటి. లోపల చీకటి బయట చీకటి। చీకటి। చీకటి। వెలుగునుంచి చీకట్లోకి పడిపోయాడు.

చేతులు జోడించి మంత్రముగ్ధుడిలా గోపాలం దేవాలయ ప్రాంగణం దాటి లోపలకు నడుస్తున్నాడు.

సిద్ధాంతి చూస్తూ నిల్చున్నాడు. గోపాలాన్ని అనుసరించడానికి అడుగు ఎత్తబోయాడు. విద్యుత్ తగిలినట్టు అడుగు వెనక్కి వేశాడు.

సిద్ధాంతికి మళ్ళీ కాళ్లకింద ఏదో చల్లగా తగిలి 'కిచ్' మన్నట్టు అన్పించింది.

అది పసిబిడ్డ పొంగొంతుకో, లేక చూలాలి నిండు గర్భమో ।

సిద్ధాంతి తల విదిలించుకున్నాడు

చంకలోని పంచాంగం చేతిలోకి తీసుకొని చూసాడు.

కళ్ళు జ్యోతుల్లా మండుతున్నాయి.

మనసును చుట్టుఉన్న చీకటి పటాపంచలైనట్టు అన్పించింది.

చేతిలోని పంచాంగం ఆంజనేయస్వామివారి గుడి గోడనక్కగా దొర్లు తున్న కుక్కమీదకు విసిరాడు.

రొంటినున్న ఐదు రూపాయల కాగితం తీసి గుడి గోడకు ఆనుకుని కూర్చుని ఉన్న కళ్ళులేని కబోది గిన్నెలోకి విసిరాడు. రెండుసార్లు తల పంకించి, పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ, ముందుకు, ఆంజనేయస్వామివారి గుడిదాటి వెళ్ళిపోయాడు.